సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



ఎత్తిపోతల పథకంలో చోరీ

ఎత్తిపోతల పథకాలే లక్ష్యంగా చోరీలు జరుగుతున్నాయి. దుండగులు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లోని విలువైన సామగ్రిని ఎత్తుకెళ్తున్నారు.

- 8లో ▸



ఖాతాలు తీసినా..

పంచాయతీ కార్మికుల వేతనాల కోసం టీఎస్‌జీపాస్ ఖాతాలు తెరిపించినా నిధుల జమలో అలసత్వం చోటు చేసుకుంటుంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.7 /22.2

వాతావరణం

ఉదయం చల్లటి గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

ఆన్‌లైన్ షాపర్స్ లక్ష్యంగా..



- తాజాగా నిజామాబాద్‌లో ఇలాంటి పార్శిల్స్ డెలివరీ
- డబ్బులు చెల్లించి పార్శిల్ విప్పితే, అందులో చిల్లర వస్తువులు..
- వాట్సాప్ గ్రూపుల్లోకి సైతం చొరబడుతున్న సైనం
- బాధితుల సిమ్‌ను, వాట్సాప్‌ను ఆధీనంలోకి తీసుకుంటున్న మాయగాళ్లు

సైబర్ కేటుగాళ్లు రోజు రోజుకూ కొత్త కొత్త విధానాలతో మోసాలు చేస్తున్నారు. టెక్నాలజీని ఉపయోగించుకుని పలువురి ఖాతాలకు చిల్లులు పెడుతున్నారు. ఇలా కూడా సైబర్ నేరాలు చేస్తారా అనేవిధంగా సైబరాసురులు ఊహించని రీతిలో మోసాలకు దిగుతున్నారు. ప్రస్తుత గ్లోబల్ ప్రపంచంలో స్మార్ట్ ఫోన్ ఉపయోగించి సింపుల్‌గా సైబర్ నేరాలు చేస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో ప్రతిఒక్కరూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన పరిస్థితి నెలకొంది.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

నిజామాబాద్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన ఓ వ్యాపారస్తుడికి ఇటీవల క్యాష్ ఆన్ డెలివరీ (సీవోడీ) పార్శిల్ వచ్చింది. ఈ వ్యాపారి ఆన్‌లైన్ షాపింగ్‌లో తన ఇంటిలో అవసరమైన గృహోపకరణం కోసం ఆర్డర్ చేశాడు. దానికి సంబంధించిన డెలివరీ రాకపోగా, ఓ కొరియర్ సంస్థ ద్వారా ఈ నెల 11న తన ఇంటి చిరునామాకు పార్శిల్ వచ్చింది. నగదు చెల్లించి పార్శిల్ తీసుకుని దాన్ని తెరవగా అందులో వాడేసిన చిన్న ఖాళీ నెయిల్ పాలిష్ సీసా, నీళ్లతో నింపిన చిన్న స్ప్రేబాటిల్ ఉంది. అయితే ఈ పార్శిల్‌పై హైదరాబాద్‌లోని నారాయణగూడ ఏరియాకు చెందిన వ్యక్తి చిరునామా ఉంది. ఈ చిరునామా పైభాగంలో నిజామాబాద్ సుభాష్‌నగర్‌కు చెందిన సదరు వ్యాపారి అడ్రస్ స్లిప్ అతికించి మరీ పార్శిల్ డెలివరీ చేయడం గమనార్హం. అయితే తాను ఆర్డర్ చేసిన వస్తువు వచ్చిందని నగదు చెల్లించి తీసుకున్న వ్యాపారి మోసపోయినట్లు తెలుసుకుని అవాక్కయ్యాడు. కొరియర్ సంస్థ వాళ్లను వాకబు చేస్తే హర్యానా నుంచి వచ్చినట్లు చెప్పడం గమనార్హం. అయితే ఈ మోసం చుట్టుపక్కల నుంచే చేసినట్లు అర్థమవుతోంది.


పార్శిల్‌లో వచ్చిన వస్తువులు

■ ఇటీవల నిజామాబాద్‌కు చెందిన పలువురు ఉపయోగిస్తున్న వాట్సాప్ గ్రూపును సైతం తమ ఆధీనంలోకి తీసుకున్న సైబర్ నేరగాళ్లు చాలా తెలివిగా మోసం చేశారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన సైబర్ కేటుగాళ్లు ఏకంగా పర్సనల్ ఫోన్ కాంటాక్ట్ నంబర్ల ద్వారా బాధితుల బంధు వులు, స్నేహితులతో నే రుగా చాటింగ్‌లోకి వెళుతున్నారు. ఇలా హ్యాక్ చేసిన ఫోన్‌ను తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు.

■ ఇటీవల నగరానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి వాట్సాప్‌కు సైబర్ కేటుగాళ్లు ఓ లింక్‌ను పంపారు. ఈ వాట్సాప్ ఉన్నది ఆపిల్ ఐఫోన్ కావడం గమనార్హం. ఈ ప్రజాప్రతినిధి ఫోన్‌తో పాటు అన్ని యాప్‌లు ఫేస్ ఐడీతో ఓపెన్ అవుతాయి. అయితే వాట్సాప్ కూడా అలా ఓపెన్ చేసి కొత్తగా వచ్చిన ఓ లింక్‌ను క్లిక్ చేశారు. తక్షణమే సదరు వాట్సాప్‌తో పాటు ఫోన్‌లోని సిమ్ పూర్తిగా సైబర్ నేరగాడి ఆధీనంలోకి వెళ్లిపోయింది. బాధిత ప్రజాప్రతినిధి ఎవరికీ ఫోన్ చేయలేని, ఎవరి వద్ద నుంచీ ఫోన్‌కాల్స్ రిసీవ్ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కొద్దిసేపటిలోనే కేటుగాళ్లు వాట్సాప్ ద్వారా సదరు మాజీ ప్రజాప్రతినిధి కాంటాక్ట్ నంబర్లలోని 90 మందితో చాటింగ్‌లోకి వెళ్లారు. అప్పటికే వాట్సాప్ మొత్తం కేటుగాడి ఆధీనంలో ఉండడంతో బంధువులెవరు, స్నేహితులెవరు అనే విషయాన్ని తెలుసుకుని అందుకు అనుగుణంగా చాటింగ్ చేయడం విశేషం. ఇలా ప్రతిఒక్కరికి చాటింగ్‌లో అత్యవసరంగా రూ.42 వేలు కావాలంటూ మెసేజ్ చేశాడు. ఇలా మెసేజ్ అందుకున్నవారిలో ముగ్గురు వ్యక్తులు సదరు ప్రజాప్రతినిధి ఫోన్‌పేకు డబ్బులు పంపారు. ఈ డబ్బులు నేరుగా సైబర్ కేటుగాళ్ల ఖాతాల్లో చేరిపోయాయి. గంటలోపే అప్రమత్తమైన సదరు మాజీ ప్రజాప్రతినిధి తన సిమ్‌ను డీయాక్టివేట్ చేయించడంతో సైబర్ కేటుగాళ్ల మోసానికి బ్రేక్ వేయించగలిగారు.


హైదరాబాద్ అడ్రస్‌పై నిజామాబాద్ అడ్రస్ స్లిప్ అతికించిన దృశ్యం

డెలివరీ పార్శిల్ వచ్చిందని..

కొందరు ఆన్‌లైన్ షాపింగ్ చేసినప్పుడు సైతం సైబర్ కేటుగాళ్లు ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారు. షాపింగ్ చేయనివారికి సైతం పార్శిల్ వచ్చిందని, బయట డెలివరీ బాయ్ వెయిట్ చేస్తున్నాడని, ఓటీపీ చెప్పాలని కేటుగాళ్లు అడుగుతున్నారు. ఇలా చెప్పినవారి కాల్స్‌ను సైతం ఫార్వర్డింగ్ చేసుకుంటున్నారు.

సిమీ, పీఎఫ్‌ఐలకు నిజామాబాద్ అడ్డా

- కాంగ్రెస్ హయాంలో లా అండ్ ఆర్డర్ బాగాలేదు
- ఎంపీ అర్వింద్ ధర్మపురి



ఖలీల్‌వాడి: సిమీ, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాలకు నిజామాబాద్ అడ్డాగా మారిందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఐజీ కార్యాలయంలో శనివారం సీపీ పోతరాజు సాయిచైతన్యతో ఎంపీ సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో లా అండ్ ఆర్డర్ బాగాలేదన్నారు. వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. యువకుడిపై కేసు నమోదు చేసిన సందర్భంగా ఓ వర్గానికి చెందిన సుమారు 400 మంది బైక్ ర్యాలీ నిర్వహించి, హారన్ కొట్టుడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే మాత్రం కేసు నమోదు చేయలేదన్నారు. తాను పోలీసులతో మాట్లాడిన తర్వాత బాధ్యులపై కేసులు నమోదు చేశారన్నారు. హిందువుల పండుగలకు ఆంక్షలు ఎక్కువయ్యాయని, తప్పు చేసిన వారి విషయంలో మత ప్రస్తావన ఎందుకు తీసుకువస్తున్నారని ప్రశ్నించారు. ఇటీవల దొరికిన ఉగ్రవాదులను పోలీసులు విచారిస్తే స్వచ్ఛంద సంస్థల ముసుగులో లవ్‌జీహాదీలకు సపోర్టు చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మర్వాడీ గో బ్యాక్ కాదని, ఇక్కడే ఉన్న బంగ్లాదేశ్, మయన్మార్, టర్కీ దేశాల వారిని వెళ్లగొట్టాలని సూచించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు, ఉగ్ర కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని సీపీ సాయి చైతన్యను కోరినట్లు ఎంపీ అర్వింద్ తెలిపారు.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీకి మళ్లీ పెరిగిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు మళ్లీ పెరిగింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు లక్ష క్యూసెక్కులకు చేరింది. దీంతో ప్రాజెక్ట్‌లోని 23 వరద గేట్ల ద్వారా 90 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. శనివారం ఉదయం ప్రాజెక్ట్‌లోకి 90 వేల క్యూసెక్కులకు వరద నీరు తగ్గిపోవడంతో వరద గేట్ల ద్వారా గోదావరిలోకి 75 వేల క్యూసెక్కులకు నీటి తగ్గించారు. మధ్యాహ్నానికి లక్షా 32 వేల క్యూసెక్కులకు పెరగడంతో గోదావరిలోకి లక్షా 15 వేల క్యూసెక్కులకు నీటి విడుదలను పెంచారు. రాత్రి వరకు అంతేస్థాయిలో ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో కొనసాగింది. ప్రాజెక్ట్ నుంచి ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 8 వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 684 క్యూసెక్కుల నీరు పోతుంది. కాగా శనివారం సాయంత్రానికి అంతేస్థాయి నీటి మట్టంతో నిండుకుండలా ఉంది.

సందర్శించిన హైకోర్టు జడ్జీలు



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను శనివారం హైకోర్టు జడ్జీలు సామ్ కోషి, సృజన సందర్శించారు. నిర్మల్ జిల్లా పర్యటనను ముగించుకుని వారు తిరుగు ప్రయాణంలో ఎస్సారెస్పీని సందర్శించారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి జడ్జీలకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఎస్సారెస్పీ అతిథి గృహంలో జడ్జిలు, కలెక్టర్‌తో సమావేశమయ్యారు. ప్రాజెక్ట్ గురించి, జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై చర్చించారు.

వరల్డ్ బాక్సింగ్ కమిటీలో నిఖత్ జరీన్‌కు చోటు



నిజామాబాద్‌నాగారం: వరల్డ్ బాక్సింగ్ అథ్లెటిక్ కమిటీలో జిల్లాకు చెందిన బాక్సర్ నిఖత్ జరీన్‌కు చోటు లభించింది. కమిటీలో టర్కీ, ఆస్ట్రేలియా, వేల్స్, యూఎస్‌ఏ, ఫ్రాన్స్ దేశాలకు చెందిన క్రీడాకారులతోపాటు భారత్ తరపున నిఖత్‌కు సభ్యురాలిగా అవకాశం ఇచ్చారు.


రికార్డుల నిర్వహణపై డీఎంహెచ్‌వో ఆగ్రహం



బాల్కొండ: రికార్డుల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్న బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందిపై డీఎంహెచ్‌వో రాజశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శనివారం ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యుల, సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. అనంతరం మందుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వైద్యవిధాన పరిషత్ నుంచి వైద్యుల కొరత ఉందని, దీంతో జిల్లా వైద్య శాఖ నుంచి మరో ఇద్దరు వై ద్యులను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. వారంలో మూడు రోజులు ఇక్కడ సేవలందిస్తారని తెలిపారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నానో యూరియా వాడకం పెరిగేలా చూడాలి

- జిల్లా వ్యవసాయాధికారి గోవింద్



డిచ్‌పల్లి: రైతులు పంటల సాగుకు నానో యూరియా వాడకాన్ని అలవాటు చేసుకోలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ సూచించారు. శనివారం డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఆయన సందర్శించారు. యూరియా నిల్వలపై సమీక్షించారు. భవిష్యత్‌లో నానో యూరియా వాడకం పెంచాలని, ఈ విషయంలో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం సొసైటీ పరిధిలో యూరియా కొరత లేదని చైర్మన్ రామకృష్ణ తెలిపారు. ఆయన వెంట సొసైటీ సీఈవో నారాయణరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

త్వరలోనే ఇందూరుకు వందే భారత్



ఎన్‌సీసీఐ నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

- జిల్లాకు ఇండస్ట్రియల్ కారిడార్
- ఎంపీ అర్వింద్ ధర్మపురి
- ఎన్‌సీసీఐ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నిజామాబాద్ రూరల్: త్వరలోనే ఇందూరు నుంచి ముంబై, మధ్యప్రదేశ్‌లకు వందేభారత్ రైలు సౌకర్యం కల్పించనున్నట్లు పార్లమెంట్ సభ్యుడు అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎన్‌సీసీఐ) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వ్యాపార, వాణిజ్య సంబంధాల నేపథ్యంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. వందేభారత్ రైలుకు సంబంధించిన ఫైలు రైల్వే శాఖ మంత్రి వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. జిల్లా కేంద్రంలో రైల్వే బైపాస్ నిర్మాణం కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో వ్యాపార, వాణిజ్య రంగాలను ప్రోత్సహించేందుకు కేంద్రంతో మాట్లాడి నిధులు తెచ్చేందుకు తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రైల్వే బ్రిడ్జిలు, కొత్త రైల్వేలైన్ నిర్మాణాల ఆలస్యానికి గత ప్రభుత్వ పాలకుల అవినీతి, అక్రమాలే కారణమని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు. అనంతరం ఎన్‌సీసీఐ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, శ్రీనివాసరావు, ఇతర కార్యవర్గసభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ రాజమార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భారతలక్ష్మి
- మూడో లోక్‌అదాలత్‌లో 26,390 పెండింగ్ కేసులు పరిష్కారం
- రూ. 9.26 కోట్ల పరిహారం చెల్లింపు


కక్షిదారుకు పరిహారం చెక్కును అందజేస్తున్న జిల్లా జడ్జి జీవీఎన్ భారతలక్ష్మి

నిజామాబాద్ లీగల్ : కేసుల సత్వర పరిష్కారంలో లోక్ అదాలత్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, ప్రజలు వీటిని వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భారతలక్ష్మి పేర్కొన్నారు. జాతీయ మూడో లోక్ అదాలత్‌ను జిల్లా కేంద్రంలోని న్యాయ సేవా సంస్థ ప్రాంగణంలో శనివారం జడ్జి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాజీమార్గమే -రాజమార్గం అన్న నినాదంతో ప్రారంభమైన లోక్ అదాలత్‌లు అనేక పెండింగ్ కేసులకు ముగింపు పలికాయన్నారు. కోర్టుల చుట్టూ ఏళ్లపాటు తిరిగే బదులు కక్షిదారులు తమ కేసుల్ని లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకుని మానసిక ప్రశాంతతను పొందవచ్చని వివరించారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిళ్ల సాయిరెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన పెరగడంతో జిల్లా న్యాయసేవా సంస్థ లోక్ అదాలత్ సేవలను విరివిగా వినియోగించుకుంటున్నారని, ఇది పెండింగ్ కేసుల పరిష్కారంలో ముందడుగని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి విజయభాస్కర్ రావు, నాల్గో అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి హరీష, తెలంగాణ బార్ అసోసియేషన్ సభ్యుడు రాజేందర్ రెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన బెంచ్‌లు	18
పరిష్కరించిన ప్రధాన కేసులు (సివిల్ + క్రిమినల్)	26,118
ప్రీ-లిటిగేషన్ కేసులు	272
బాధిత కక్షిదారులకు ఇప్పించిన అవార్డు రూ.9,26,00,691	

సిరికొండలో భారీ వర్షం

సిరికొండ: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. 12 సెంటీమీటర్ల వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. మండల కేంద్రంలోని ఎల్లమ్మ చెరువు అలుగు పారడంతో పక్కనే ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌ను వరద ముంచెత్తింది. బైపాస్ రోడ్‌లో వరద నీరు పొంగి ప్రవహించింది. తాళ్లరామడుగులో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వరద నీరు ఇళ్లలోకి చేరింది. వరదతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


తాళ్లరామడుగులో ఇళ్లలోకి చేరిన వరద నీరు

చుట్టం చూపుగా వచ్చి చోరీలు

- రాజస్థాన్‌కు చెందిన నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: చుట్టం చూపుగా వచ్చి చోరీలకు పాల్పడుతున్న రాజస్థాన్‌కు చెందిన ఓ నిందితుడిని కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గతనెల 25 న జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన మాసిరెడ్డి శివారెడ్డి కుటుంబం ఇంటికి తాళం వేసి దైవదర్శనం కోసం వేములవాడకు వెళ్లింది. మరుసటి రోజు వచ్చి చూసేసరికి చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లోని 19 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దర్యాప్తు చేశారు. శనివారం హౌసింగ్‌బోర్డు కాలనీలో ఓ కారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకుని వాకబు చేశారు. తెలంగాణ నంబర్ ప్లేట్ కారులో తిరుగుతూ హిందీలో మాత్రమే మాట్లాడడంతో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడని ఎస్పీ తెలిపారు. నిందితుడిని రాజస్థాన్ రాష్ట్రంలోని కరోలీ జిల్లా అజీజ్‌పూర్ గ్రామానికి చెందిన హన్సరాజ్ మీనాగా గుర్తించారు. అతడు కొద్ది రోజుల క్రితం మెదక్ రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉండే తన బంధువు ఇంటికి చుట్టం చూపుగా వచ్చాడని పేర్కొన్నారు. స్నేహితుడైన అభిషేక్‌తో కలిసి కామారెడ్డిలో తాళం వేసిన ఇంట్లో చోరీ చేశాడన్నారు. నిందితుడి వద్ద నుంచి 2 తులాల బంగారు ఆభరణాలు, కారు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు.


కేసు వివరాలు తెలుపుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

సొసైటీ డైరెక్టర్లపై వేటు!

- రుణాలు చెల్లించని వారిని పాలకవర్గాల నుంచి తొలగిస్తున్న సహకార శాఖ
- ఇప్పటి వరకు 20 మంది వరకు ఉద్వాసన
- పలుమార్లు నోటీసులిచ్చినా లెక్క చేయకపోవడంతో చర్యలకు దిగిన అధికారులు



డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రుణాలు తీసుకొని తిరిగి చెల్లించని డైరెక్టర్లపై జిల్లా సహకార శాఖ చర్యలకు దిగింది. జిల్లా వ్యాప్తంగా పలు సొసైటీల్లోని దాదాపు 20 మంది డైరెక్టర్లపై అధికారులు వేటు వేశారు. వారి పదవితోపాటు పాలకవర్గం నుంచి పేరును అధికారులు తొలగించారు. అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.

జిల్లాలో మొత్తం 89 పీఏసీఎస్‌లు ఉన్నాయి. ఇటీవల 60 సొసైటీలకు మాత్రమే పదవీకాలాన్ని ప్రభుత్వం మళ్లీ పొడిగించింది. మిగిలిన 29 సొసైటీలకు పొడిగింపు ఇవ్వలేదు. మొదటిసారి పెంచిన సమయంలో బకాయిలున్న డైరెక్టర్ల జోలికి వెళ్లలేదు. ఇటీవల రెండోసారి పెంచిన సమయంలో మాత్రం రుణాలు తీసుకొని డీఫాల్టర్ల కింద ఉన్న డైరెక్టర్ల పేర్లను ప్రభుత్వం అధికారుల ద్వారా సేకరించింది. అవినీతి జరిగిన సొసైటీల వివరాలు, పాలకవర్గంలో ఉండి రుణాలు కట్టని వారి పేర్లను కూడా ప్రభుత్వానికి పంపారు. ఇదేదో సాధారణంగా తీసుకుంటున్న డేటానేమోనని అంతా అనుకున్నారు. కానీ, ఈ విధంగా జరుగుతుందని ఎవరూ ఊహించలేదు. ధర్పల్లి మండలం హొన్నాజీపేట్, ఇందల్వాయి మండలంలోని ఇందల్వాయితోపాటు నల్లవెల్లి, నందిపేట్‌లో చింరాజ్‌పల్లి, ఇతర మండలాల్లోని సొసైటీల్లో డీఫాల్టర్లుగా ఉన్న డైరెక్టర్లకు ఉద్వాసన పలికారు. అయితే, పెద్ద మొత్తంలో రుణాలు పొంది వాటిని తిరిగి కట్టని మరికొన్ని సొసైటీలకు సంబంధించిన డైరెక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

రైతులకో తీరు..డైరెక్టర్లకో తీరా!

రైతుల అభ్యున్నతి కోసం పనిచేయాల్సిన సొసైటీల్లో డైరెక్టర్లు సొంత లాభాపేక్షను చూసుకుంటున్నారనే విమర్శలు రైతుల నుంచి వస్తున్నాయి. రైతులు రుణాలు తీసుకొని కట్టపోతే అధికారులు వారి ఇంటికి నోటీసులు పంపడమే కాకుండా ఆస్తులను జప్తు చేస్తున్నారు. కానీ, పాలకవర్గ పదవీలో ఉంటూ రూ.లక్షల్లో రుణాలు తీసుకొని ఏళ్ల తరబడి సక్రమంగా చెల్లించని డైరెక్టర్లను ఏమీ అనకపోవడంతో గత కొంతకాలంగా రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులకో తీరు... డైరెక్టర్లకో తీరా అంటూ విమర్శలు మొదలయ్యాయి. ఈ క్రమంలో డీఫాల్ట్ డైరెక్టర్లకు పలుమార్లు నోటీసులు పంపించారు. సమయం ఇచ్చినా వారు లెక్క చేయకపోవడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించి పదవి నుంచి తొలగించడం ప్రారంభించారు. కాగా, తొలగింపబడిన వారి నుంచి బకాయిలను వసూలు చేసేందుకు లీగల్ పద్ధతిలో వెళ్లనున్నట్లు తెలిసింది. అయితే, పదవిని కోల్పోయిన డైరెక్టర్లు పాలకవర్గంలో తిరిగి చేరేందుకు పైరవీలు మొదలుపెట్టారు. రాజకీయ నేతలతో అధికారులకు ఫోన్లు చేయిస్తున్నట్లు సమాచారం. డీఫాల్ట్ డైరెక్టర్ల తొలగింపు విషయమై జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌రావును సంప్రదించగా చర్యలు వాస్తవమేనని తెలిపారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

క్లుప్తంగా

బీజేపీ టికెట్లకు అన్ని పార్టీల నేతల ప్రయత్నం



సుభాష్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ టికెట్ల కోసం ఇతర అన్ని పార్టీల నేతలు ప్రయత్నిస్తున్నారని, కానీ గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తామని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి అధ్యక్షతన సేవాపక్షం కార్యశాల నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ.. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి మాట్లాడుతూ.. కార్యకర్తలు ప్రతి ఇంటికి బీజేపీ సిద్ధాంతాలను తీసుకెళ్లాలని, సేవా పక్షంలో భాగంగా ప్రతి బూత్‌స్థాయిలో కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతిరెడ్డి, నాయకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, రాంచందర్, పాలెపు రాజు, నర్సారెడ్డి, జిల్లా, నగర, మండలస్థాయి నాయకులు పాల్గొన్నారు.

ఖాతాలు తీసినా వెతలు తీరలే..

- జీపీ కార్మికుల వేతనాల కోసం పంచాయతీకో టీఎస్‌బీపాస్ ఖాతా
- ఎస్‌ఎఫ్‌సీ నుంచి నిధులు రాకపోవడంతో రెండు నెలలుగా ఆగిన వేతనాలు
- ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న కార్మికులు



ఇటీవల మోర్తాడ్‌కు వచ్చిన సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్మికులు

మోర్తాడ్(బాల్కొండ): పంచాయతీ కార్మికుల వేతనాలను స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎస్‌ఎఫ్‌సీ) నిధుల నుంచి చెల్లించేందుకు అంగీకరించి ప్రభుత్వం అందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినా ప్రయోజనం లేకపోయింది. ప్రతి పంచాయతీకి టీఎస్‌బీపాస్ ఖాతాలను తెరిపించినా నిధులు జమ చేయడంలో అలసత్వం చోటు చేసుకుంటుంది. ఫలితంగా సకాలంలో వేతనాలు అందక పంచాయతీ కార్మికులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

అస్తవ్యస్తంగా పాలన..

ఎస్‌ఎఫ్‌సీ ద్వారా జిల్లాలోని పంచాయతీలకు ప్రతి నెలా రూ.10.30 కోట్ల నిధులను విడుదల చేయాల్సి ఉంది. మరోవైపు పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడం లేదు. దీనికి తోడు ఎస్‌ఎఫ్‌సీ నిధుల విడుదలలో తీవ్ర జాప్యం ఏర్పడటంతో పంచాయతీల పాలన అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలో మొత్తం 545 పంచాయతీలు ఉండగా, అందులో కార్మికులు 2,198 మంది, కారోబార్లు 522 మంది విధులు నిర్వహిస్తున్నారు. అందరికీ ఒకే రకంగా ప్రతి నెలా రూ.9,500 చొప్పున వేతనం చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఎస్‌ఎఫ్‌సీ నిధుల నుంచి ప్రతి నెలా టీఎస్‌బీపాస్ ఖాతాలకు రూ.2 కోట్ల 58 లక్షల 40 వేలను జమ చేస్తే పంచాయతీ కార్మికుల వేతనాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. గతంలో మూడు, నాలుగు నెలలకు ఒకసారి వేతనాలకు గ్రాంటును విడుదల చేయగా ప్రస్తుతం గ్రాంటు విడుదల కాకపోవడంతో రెండు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదు. దీంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

సర్దుబాటు చేయిస్తున్నాం

ఎస్‌ఎఫ్‌సీ నిధులు విడుదలలో జాప్యం ఏర్పడితే వేతనాల చెల్లింపు ఆలస్యం అవుతుంది. పంచాయతీల్లో నిధులు ఉంటే సర్దుబాటు చేయించి కార్మికులకు వేతనాలు ఇస్తున్నాం. కొన్ని పంచాయతీల్లోనే ఆదాయం బాగుంది. చాలా చోట్ల ఆదాయం తక్కువగా ఉంది. – శివకృష్ణ, డీఎల్‌పీవో, ఆర్మూర్

సామాజిక సేవలు అభినందనీయం

నిజామాబాద్ రూరల్: సమాజంలో విద్య, వైద్య రంగాలకు జోస్ ఆలుక్కాస్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. నగరంలోని జోస్ ఆలుక్కాస్ జువెలరీ షోరూంలో శనివారం మూడవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. గత మూడు సంవత్సరాలుగా జిల్లాలోని ఆస్పత్రులు, బడులకు అవసరమైన సామగ్రిని జోస్ ఆలుక్కాస్ సంస్థ అందజేస్తుండటంపై అభినందించారు. ప్రస్తుతం నాలుగు ప్రభుత్వ పాఠశాలకు సుమారు రూ.6.96 లక్షల విలువగల కంప్యూటర్‌లు, డిజిటల్ టీవీ, తాగునీటి శుద్ధియంత్రం వాటికి నిధులు అందజేశారన్నారు. మూడో వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 13 నుంచి 19 వరకు ప్రత్యేక ఆఫర్లు అందజేస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అనంతరం వివిధ పాఠశాలకు ఎంపీ చేతుల మీదుగా సీఎస్‌ఆర్ ఫండ్ చెక్కులను అందజేశారు. బ్రాంచ్ మేనేజర్ ధనుష్, అసిస్టెంట్ మేనేజర్ సజయ్, అకౌంట్స్ మేనేజర్ జితిన్, పీఆర్‌వో పిప్పెర నరేందర్, తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఎంపీ అర్వింద్ ధర్మపురి

క్రైం కార్నర్

తొట్టెలో పడి బాలుడు మృతి

- మద్నూర్‌లో చోటుచేసుకున్న విషాద ఘటన
- కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు

మద్నూర్(జుక్కల్): నీటి తొట్టెలో పడి బాలుడు ప్రాణాలు వదిలాడు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిర నగర్ కాలనీకి చెందిన మేత్రివార్ రాజు, అనిత దంపతులు మద్నూర్‌లోని పాత బస్టాండ్‌లో టీ పాయింట్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాజు టీ పాయింట్‌లో ఉండగా, అనిత ఇంట్లో వంట చేస్తోంది. వీరికి ఇద్దరు కొడుకులు ఉండగా చిన్న కొడుకు అక్షయ్ (2) ఇంటి ముందు ఆడుకుంటూ నీటి తొట్టె వద్దకు వెళ్లాడు. అక్షయ్ చేతిలో ఉన్న ఆట వస్తువు నీటి తొట్టెలో పడటంతో దాన్ని తీసుకోవడానికి వంగడంతో బ్యాలెన్స్ తప్పి తల నీటి తొట్టెలోకి పడిపోయి కాళ్లు బయటకు తేలాయి. కొద్ది సేపటికి తల్లి అనిత బయటకు వచ్చి చూడగా అక్షయ్ నీటి తొట్టెలో కనిపించాడు. బాలుడిని నీటి తొట్టెలోంచి బయటకు తీసి స్థానికులతో కలిసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు.



అక్షయ్ (ఫైల్)

జీజీహెచ్‌లో నవజాత శిశువు మృత్యువాత

- ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టిన బంధువులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అప్పుడే పుట్టిన శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందిందని శిశువు కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. వివరాలు ఇలా.. తాడ్వాయి మండలం బ్రహ్మాజీవాడి గ్రామానికి చెందిన అఖిల పురిటి నొప్పులు రావడంతో శుక్రవారం సాయంత్రం కామారెడ్డి జీజీహెచ్‌కు వచ్చింది. వైద్యులు అర్ధరాత్రి ఆమెకు ప్రసవం చేశారు. ఆడపిల్ల పుట్టడంతో మహాలక్ష్మి పుట్టిందని కుటుంబ సభ్యులంతా సంబరంలో ఉన్నా ఆ ఆనందం 5 నిమిషాలు కూడా లేకుండా పోయింది. పుట్టిన శిశువులో చలనం లేకపోవడంతో మృత శిశువు జన్మించిందని వైద్యులు చెప్పారు. దీంతో బంధువులు వైద్యులతో వాగ్వాదానికి దిగారు. కాలయాపన చేయకుండా ఆపరేషన్ చేసి ఉంటే శిశువు బ్రతికేదని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాసేపు ఆస్పత్రిలో ఆందోళన చేశారు. పట్టణ పోలీసులు ఆస్పత్రికి వచ్చి వారిని సముదాయించారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా వైద్యుల నిర్లక్ష్యం ఏమాత్రం లేదన్నారు. ఉమ్మనీరు మింగడంతోనే శిశువు మృతి చెందిందని తెలిపారు.



మృతి చెందిన శిశువు

విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని భవానిపేట గ్రామ శివారులో విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతి చెందినట్లు లైన్‌మెన్ పాండు తెలిపారు. గ్రామానికి చెందిన మాదిగ బాలయ్య పొలం వద్ద బోరు మోటారు సర్వీస్ వైరు తెగిపోయి ఫినిషింగ్ వైర్‌పై పడింది. ఈక్రమంలో శనివారం అదే గ్రామానికి చెందిన ఆకుల సురేందర్, గుండ్ర సత్యనారాయణ, గుండ్ర పరందాములుకు చెందిన గేదెలు గ్రామ శివారులోకి మేతకు వెళ్లాయి. దీంతో గేదెలు మేత మేసుకుంటూ వెళ్లగా ఫినిషింగ్ వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గేదెల విలువ సుమారు రూ.3లక్షలు ఉంటుందన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



చికిత్సపొందుతూ వృద్ధురాలు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రమాదవశాత్తు గాయపడిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన నట్ట అనసూయ(79) అనే వృద్ధురాలు గత నెల 28న కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి బయటకు వెళ్లి కాలుజారి నేలపై పడిపోయింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం ఈ నెల 3న మెదక్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఈ నెల 8న హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించి చికిత్స చేయించారు. కాగా ఈ నెల 12న ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి మనువడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



నట్ట అనసూయ(ఫైల్)

ప్రియుడు మోసం చేశాడని ఆత్మహత్యాయత్నం

వర్ని: చందూర్ మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో ఓ యువతి తన ప్రియుడు మోసం చేశాడని ఆత్మహత్యకు యత్నించింది. వర్ని మండలం కూనిపూర్ క్యాంపునకు చెందిన వీరేంద్ర అనే వ్యక్తి ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేశాడని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన సదరు యువతి మనస్తాపం చెందింది. దీంతో శుక్రవారం ఆమె ప్రియుడి ఇంటి ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నం చేసింది. వెంటనే స్థానికులు బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి అక్క పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై కేసు

నవీపేట: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి శనివారం తెలిపారు. మూడు రోజుల కిందట మండల కేంద్రానికి చెందిన ఒక వర్గానికి చెందిన యువకుడు ప్రార్థనా మందిరంపై జెండాను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఇది వైరల్‌గా మారడంతో ఆగ్రహానికి గురైన మరో వర్గానికి చెందిన యువకులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆందోళన చేశారు. ఈక్రమంలో వారు పోలీస్ స్టేషన్‌లోకి చొరబడి సిబ్బందితో దురుగా ప్రవర్తిస్తూ, వారి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో ఆ వర్గానికి చెందిన ఆరుగురితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు మహిళా నిందితుల అరెస్టు



రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని రాములు ఇంట్లో గత నెల 24న జరిగిన చోరీ కేసులో ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసినట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. కోటగిరి బస్టాండ్ వద్ద శనివారం అనుమానాస్పదంగా ఉన్న బోధన్‌కు చెందిన సంగీత, రుద్రూర్ మండలం అంబం(ఆర్)కు చెందిన సునీతను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు రాములు ఇంట్లో చోరీ చేసినట్లు అంగీకరించారు. అనంతరం వారి వద్ద నుంచి 6.9 గ్రాముల బంగారం, 44.51 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

సదాశివనగర్‌లో సైబర్‌మోసం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో ఓ వ్యాపారి ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి, సుమారు రూ.8లక్షల వరకు కాజేశారు. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన కొడిప్యాక శ్రీనివాస్ గత కొంత కాలంగా జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు, వసతి గృహాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేసే టెండర్‌ను దక్కించుకుని, సరుకులను సరఫరా చేస్తుంటాడు. ఈక్రమంలో గత నెల 30న తన ఖాతాలో సరుకులకు సంబంధించి డబ్బులు జమ అయినట్లు మెసేజ్ వచ్చింది. ఈ నెల 6న తన ఫోన్ తరచూ వేడి కావడంతో ఇట్టి విషయాన్ని పోలీసులకు తెలిపాడు. పోలీసులు ఫోన్ హ్యాక్ అయిందని, వెంటనే సిమ్‌ను వేరే ఫోన్‌లో వేసుకోమని చెప్పడంతో అతడు అలానే చేశారు. మరుసటి రోజు తన ఖాతా నుంచి డబ్బులను తీసుకుందామని కామారెడ్డిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు వెళ్లగా గతంలోనే రూ.4లక్షల 50వేలు, రూ.4లక్షల 27వేలు ఎలాంటి మెసేజ్ లేకుండా డ్రా అయినట్లు చూపించింది. దీంతో ఇదేమిటని బ్యాంక్ అధికారులను ప్రశ్నించగా ఇది సైబర్ నేరగాళ్ల పని అని గుర్తించి వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని చెప్పారు. సదరు వ్యాపారి ఈ నెల 9న సదాశివనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వ్యాపారి తెలిపారు.

అనాథలైన సోదరులను ఆదుకోరూ!

- తండ్రి దుబాయ్‌లో గల్లంతు
- ఆ బాధతో అనారోగ్యానికి గురై ఇటీవల మృతిచెందిన తల్లి
- పట్టించుకునేవారు లేక విలపిస్తున్న అన్నదమ్ముళ్లు
- ఉదార స్వభావులు ఆదుకోవాలని గ్రామస్తుల వినతి

మాక్లూర్: తండ్రి గల్ఫ్ దేశానికి వెళ్లి గల్లంతుకాగా, ఆ బాధతో తల్లి మంచంపట్టి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో వారి ఇద్దరు కుమారులు అనాథలుగా మిగిలారు. పట్టించుకునేవారు లేక సోదరులు విలపిస్తుండగా, ఉదార స్వభావులు వారిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మండలంలోని మాదాపూర్‌కు చెందిన పర్సోల్లా రాజు బతుకుదెరువు నిమిత్తం రెండేళ్ల క్రితం దుబాయ్ వెళ్లి అక్కడ గల్లంతయ్యాడు. ఇప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు. ఆ బాధతో భార్య సత్తెమ్మ మచ్చం పట్టి అనారోగ్యంతో వారం రోజుల క్రితం మృతి చెందింది. దీంతో వారి కుమారులు ఎవరు లేని అనాథలుగా మిగిలారు. అంతేకాకుండా మృతి చెందిన తల్లికి అంత్యక్రియలు ఎలా చేయాలో తెలియక బిక్కుబిక్కుమంటూ విలపిస్తూ ఉంటే గ్రామస్తులు స్పందించి విరాళాలు సేకరించి అంత్యక్రియలు పూర్తి చేశారు. తల్లి మృతితో ఒంటరైన పిల్లలకు చిన్న ఇల్లు తప్పా వారి వద్ద ఏమి లేవు. అన్నదమ్ముల్లో పెద్దవాడైన రోహిత్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతుండగా, తమ్ముడు దీక్షిత్ 6వ తరగతి చదువుతున్నాడు. దీంతో వీరి దీనస్థితిని చూసి చలించి, ఇప్పటికే ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి రూ.10,000, ఆస్కార్ యూత్ సభ్యులు రూ.12000 నగదు, నిత్యవసర సరుకులను అందించారు. మరికొందరు ఉదార స్వభావులు ముందుకు వచ్చి అనాథలైన వారిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అనాథలైన సోదరులు రోహిత్, దీక్షిత్

రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్‌గా గాంధారి ఈఎంఆర్‌ఎస్

కొత్తగూడ: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి ఈఎంఆర్‌ఎస్‌లో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో కామారెడ్డి జిల్లా గాంధారి ఈఎంఆర్‌ఎస్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. శనివారం క్రీడల ముగింపు వేడుకలు నిర్వహించగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హాజరై, మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరాశపడకుండా గెలుపుకోసం మరోసారి ప్రయత్నించాలన్నారు. అనంతరం ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన గాంధారి ఈఎంఆర్‌ఎస్‌కు, అలాగే వివిధ విభాగాల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్, ఆర్డీవో కృష్ణవేణి, స్పోర్ట్స్ ఆఫీసర్ వీర్యనాయక్, ఆర్సీవో రత్నకుమారి, రాష్ట్ర ఉపాధిహామీ సంస్థ డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ అజయ్‌సింగ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గాంధారి జట్టుకు బహుమతి అందజేస్తున్న మంత్రి సీతక్క, ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్

చౌడమ్మ కొండూర్ ఎత్తిపోతల పథకంలో చోరీ

- ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్, ఆయిల్ ఎత్తుకెళ్లిన దుండగులు
- ఏడాదిలో మూడోసారి ఘటన

నందిపేట్(ఆర్మూర్): జిల్లాలో ఎత్తిపోతల పథకాలే లక్ష్యంగా వరుస చోరీలు జరుగుతున్నాయి. దుండగులు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లోని విలువైన సామగ్రిని ఎత్తుకెళ్తున్నారు. పోలీసులు నమోదు చేస్తున్నా ఇప్పటి వరకు దుండగులను పట్టుకున్న దాఖలాలు లేవు. తాజాగా చౌడమ్మ కొండూర్ ఎత్తిపోతల పథకం పరిధిలోని ఉమ్మెడ శివారులో ఉన్న రెండవ పంపుహౌజ్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. ఇనుప రాడ్లతో లిఫ్ట్ గదిలోకి ప్రవేశించి అక్కడ విధులు నిర్వహిస్తున్న సాకలి ముత్తెన్న, సాకలి శ్రీను అనే ఇద్దరు ఆపరేటర్లను బెదిరించి కాపలా కాశారు. అనంతరం దుండగులు 250 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగుల గొట్టి రాగి కాయిల్స్, ఆయిల్‌ను దొంగిలించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు శనివారం ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

కొలిక్కి రాని దర్యాప్తు..

ఈ సంవత్సరంలో చౌడమ్మ కొండూర్ ఎత్తిపోతల పంపుహౌజ్‌ల వద్ద మూడు సార్లు, తల్వేద ఎత్తిపోతల పథకంలో మూడు సార్లు చోరీలు జరిగాయి. దుండగులు ఎత్తిపోతల పథకాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రూ. లక్షల విలువైన రాగి కాయిల్స్, ఇంధనం, ఇతర పరికరాలను అపహరించుకుపోతున్నారు. వరుస ఘటనలు ఒకే తరహాలో జరుగుతున్నప్పటికీ చోరీలకు పాల్పడుతున్నది ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. అయినా ఒక్క కేసు కూడ దర్యాప్తు కొలిక్కి రాలేదు. ఎత్తిపోతల పథకాల ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయక పోవడంతో వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు నీరందని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎత్తిపోతల పథకాల వద్ద చోరీల నివారణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



చోరీకి గురైన చౌడమ్మ కొండూర్ ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్

ర్యాగట్లపల్లిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు!



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు



ర్యాగట్లపల్లిలోని బసవేశ్వరాలయం

- నిందితులను పట్టుకున్న గ్రామస్తులు
- ఎనిమిది మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు

భిక్కనూరు: మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామంలో గల బసవేశ్వరాలయం ప్రాంతంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ర్యాగట్లపల్లి గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న అతిపురాతనమైన బసవేశ్వరాలయం ప్రాంతంలో శనివారం వేకువజామున ప్రొక్లెయిన్ సహాయంతో కొందరూ గుప్తనిధుల కోసం తవ్వకాలను ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి వెళ్లి పనులను అడ్డుకున్నారు. గ్రామస్తులు ప్రశ్నించగా దురుసుగా సమాధానాలు చెప్పడంతో వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని నిందితులైన ర్యాగట్లపల్లి గ్రామానికి చెందిన చిన్న భూమయ్య, మహేందర్, మంత్రి దుర్గయ్య, రామాయంపేట, భిక్కనూర్‌కు చెందిన సభావత్ భరత్, నాగభూషణం, యాదగిరి, వెంకట చంద్రశేఖర్, నెల్లూరి కాంతారావులను అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజనేయులు వివరించారు.

ఆటోలు చోరీ చేసే ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి క్రైం: ఆటోల చోరీలకు పాల్పడుతున్న ఓ ముఠాను నాగిరెడ్డిపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లాకేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేష్ చంద్ర వివరాలు వెల్లడించారు. నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటకు చెందిన తాడేపల్లి క్రిష్ణ ఆటో ఈ నెల 11న చోరీకి గురైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శనివారం ఉదయం మాల్తుమ్మెద వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో పారిపోబోయిన ఇద్దరిని పట్టుకుని విచారించారు. దీంతో ఆటోల చోరీ వ్యవహారం బయటపడింది. నిందితులను నిజామాబాద్ జిల్లా మంచిప్పకు చెందిన కుమ్మరి రాజు, కొల్ల దుర్గరాజులుగా గుర్తించారు. వారిలో కుమ్మరి రాజుపై గతంలో కరీంనగర్, జగిత్యాల, మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 20 దొంగతనం కేసులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. వాటిలో ఎక్కువగా ఆటోల చోరీ కేసులే ఉన్నాయన్నారు. దుర్గరాజుపై గతంలో ఒక ఆటో చోరీ కేసు ఉన్నట్లు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి నాగిరెడ్డిపేటలో దొంగిలించిన ఆటోతో పాటు మెదక్ జిల్లాలో దొంగిలించిన 2 ఆటోలు, భిక్కనూర్‌లో ఎత్తుకెళ్లిన మరో ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని ఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకున్న కానిస్టేబుల్ గంగారాం, హోంగార్డు బాలాజీలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.